బాసర ఆర్‌జియుకెటిలో విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీలో పియుసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దీపిక.. బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, యూనివర్సిటీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా వడ్లపల్లి మండలం గొర్రెకల్ గ్రామానికి చెందిన వడ్ల దీపిక.. యూనివర్సిటీలో జరుగుతున్న వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం ఫిజిక్స్ పరీక్ష రాసిన అనంతరం తోటి విద్యార్థులతో మానసికంగా బాలేదని చెప్పి బాత్‌రూమ్‌కు వెళుతున్నట్టు చెప్పి వెళ్లింది. బాత్‌రూమ్‌కు వెళ్లి ఎంతసేపైనా తిరిగి రాకపోయేసరికి అనుమానంతో భద్రతా సిబ్బంది బాత్‌రూమ్ డోర్లను పగలగొట్టి చూడగా.. బాత్‌రూమ్ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. దాంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థిని అప్పటికే మృతి చెందిందని ధృవీకరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. కాగా, వార్షిక పరీక్షలు రాసే సందర్భంగా విద్యార్థిని కాపీయింగ్‌కు పాల్పడుతూ యూనివర్సిటీ అధ్యాపకులకు పట్టుబడినట్టు సమాచారం. దీంతో అధ్యాపకులు ఆమెపై ఇతర విద్యార్థినుల ముందు ఆగ్రహం వ్యక్తం చేయడంతో విద్యార్థిని అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే విద్యార్థిని ఆత్మహత్యపై వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ విచారణకు ఆదేశిస్తూ నలుగురు సభ్యులతో కమిటీని నియమించారు. కమిటీలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్, అసోసియేట్ డీన్, సైన్సెస్, చీఫ్ వార్డెన్, అసోసియేట్ డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ త్వరితగతిన విచారణ జరిపి నివేదికను అందజేయాలని ఆదేశించారు.

ఏజెన్సీ డిఎస్‌సి వేయాలి

- ఖాళీగా ఉన్న ఐటిడిఎ, గిరిజన ఉద్యోగాలను భర్తీ చేయాలి
- టిఎజిఎస్ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని ఐటిడిఎ పరిధిలోని గిరిజన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయటానికి ప్రత్యేకంగా ఏజెన్సీ డిఎస్‌సి నిర్వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆన్‌లైన్‌లో రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు అధ్యక్షతన జరిగింది. సమావేశం పలు తీర్మానాలు ఆమోదించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో భద్రాచలం, ములుగు, ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల కంపెనీ ప్రతినిధులు గిరిజన ప్రాంతాల్లో తిరుగుతూ అమాయక ఆదివాసులకు మాయ మాటలు చెప్పి నకిలీ విత్తనాలను అమ్ముతున్నారని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అమాయకత్వం ఆసరా చేసుకొని దళారులు వడ్డీ వ్యాపారంతో గిరిజనులను ఆర్థికంగా నష్టం చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో బ్యాంకు అధికారులు వ్యవసాయ రుణాలు ఇవ్వకుండా బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వారిని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ నెల 24 నుంచి పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించింది కానీ అర్హుల జాభితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించకుండా రహస్యంగా ఉంచుతోందన్నారు. దాంతో ఆదివాసుల భూములకు హక్కు పత్రాలు వస్తాయో రావోనని ఆందోళనలో ఉన్నారన్నారు. వెంటనే అర్హుల జాబితాను గ్రామ, మండల, జిల్లా వారీగా ప్రకటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి హక్కు పత్రం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారం పుల్లయ్య, బండారు రవి కుమార్, పొలం రాజేందర్, ఎర్రా పున్నం, సహాయ కార్యదర్శులు బైరి సోమేశ్, ఆత్రం తనుష్, సున్నం గంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 22వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వాటిని నిర్వహిస్తారు. అబ్బాయిలు 41,526 మంది, అమ్మాయిలు 30,155 మంది కలిపి 71,681 మంది విద్యార్థులు హాజరవుతారు. ఈ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వంసిద్ధం చేశారు. బుధవారం మొదటిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1 (కాంపొజిట్ కోర్సు), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-2 (కాంపొజిట్ కోర్సు) పరీక్షను నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 259 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం 259 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 259 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను, 2,800 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూం (040-23230942)ను ఏర్పాటు చేశారు.

దశాబ్ది ఉత్సవాల సాక్షిగా..

పేదల గుడిసెల విధ్వంసం

- ఎనిమిది గంటల పాటు కొనసాగిన దమనకాండ
- యూనిఫాం శాఖల మూకుమ్మడి దాడి
- తాగునీటి వనరులు ధ్వంసం
- మహిళలను అడ్డగించిన పోలీసులు
- తోపులాట... ఉద్రిక్తత
- పేదలపై దాడి అమానుషం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
పొద్దు పొడవక ముందే.. తెలవారకముందే... పక్షులు గూడు వీడుతున్న వేళ ..ఉరుములేని పిడుగులాగా పోలీస్ యంత్రాంగం పేదల గుడిసెలపై విధ్వంసం సృష్టించింది. కళ్ల మూసి తెరిచేలోగా గుడిసెలు నేలమట్టమయ్యాయి. గుడిసెలను ప్రొక్లైన్లు, డోజర్లతో తొలగించారు. మున్సిపాలిటీ ట్రాక్టర్లతో సామాగ్రిని బయటపడేశారు. ఆరు శాఖల అధికారుల మూకుమ్మడి దాడికి పేదలు తల్లడిల్లిపోయారు. మహిళలు శక్తికి మించి ప్రతిఘటించినా పోలీసులు దాడులు ఆపలేదు. దాడికి కొందరు పేదలు సొమ్మసిల్లి పడిపోయారు. ఎనిమిది గంటల పాటు కొనసాగిన ఈ విధ్వంసం అందరిని విస్మయపర్చింది. ఇదీ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే....

మహబూబాబాద్ పట్టణంలోని కురవి రహదారిని ఆనుకుని ఉన్న సర్వే నెంబర్255 /1లోని 200 ఎకరాల ప్రభుత్వ భూమిలో సుమారు 20 ఎకరాల్లో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. నాలుగు నెలల క్రితం వివిధ ప్రాంతాల నుంచి మానుకోట జిల్లా కేంద్రానికి పొట్ట చేత పట్టుకొని వలస వచ్చి కూలీలు, హమాలీ రిక్షా, భవన నిర్మాణ కార్మికులుగా కాయ కష్టం చేసుకుంటూ బతుకీడుస్తున్న పేదలంతా కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ఎర్రజెండా నీడలో గుడిసెలు వేసుకున్నారు. అడవిలో దొరికే కర్రలతో టార్పాలిన్లు కప్పుకొని బతుకీడిస్తున్నారు. అక్కడే ఉంటున్నారు. తొమ్మిదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ గృహాలు ఇస్తాయని, ఇళ్ల కట్టిస్తాయని ఆనుకుంటే ఆశలు అడియాశలు అయ్యాయి. దిక్కులేని పరిస్థితుల్లో ప్రభుత్వ భూమిలో 60 నుంచి 70 గజాల స్థలంలో గుడిసె వేసుకొని నివసిస్తున్నారు. ఇందులో కొంత భూమిని గతంలో రియల్ వ్యాపారులు చదును చేసి మట్టి పోసి రోడ్లు వేసి అమ్ముకునే ప్రయత్నం మొదలుపెట్టారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల హస్తమూ ఉంది. వారికి ప్రజా ప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో గుడిసెలు వేసుకున్న పేదలకు తరచూ అడ్డంకులు సృష్టిస్తూ వచ్చారు. ఇప్పటికే వారిపై మూడుసార్లు పోలీసులు లాఠీచార్జి చేశారు. 150 మందిపై కేసులు నమోదు చేశారు.

800 మందితో దాడి

ఈ సారి మంగళవారం వేకువజామున జిల్లా అధికార యంత్రాంగం పక్కావ్యూహంతోనే పేదల గుడిసెల కూల్చివేతకు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ఒకవైపు దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ప్రత్యేకంగా మహిళా దినోత్సవ వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయినా మానుకోట అధికారం యంత్రాంగం మహిళలు వేసుకున్న గుడిసెలను తొలగించడం గమనార్హం. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తహసిల్దార్ ఇమ్మానుయేల్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, సిఐ సతీష్, ఎక్సైజ్, ఆర్‌టిఓ, అటవీ శాఖ అధికారులు సిబ్బంది సుమారు 800 మంది వచ్చి గుడిసెలపై విధ్వంసానికి పాల్పడ్డారు. గుడిసెల్లోనికి పోలీస్ యంత్రాంగం పోనీయకుండా మహిళలు ప్రతిఘటించారు. సుమారు గంటసేపు ఇరువు వర్గాల మధ్య తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. వాగ్వివాదం జరిగింది. అన్ని శాఖల అధికారులు వచ్చి బలవంతంగా పేదలను లాగిపడేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు ప్రొక్లైన్లు, నాలుగు డోజర్లు, 6 ట్రాక్టర్లను గుడిసెల తొలగింపునకు ఉపయోగించారు. మధ్యాహ్నం వరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలోనే గుడిసెల నేలమట్టం జరిగింది. అడ్డుకున్న మహిళలను, పిల్లలను, వృద్ధులను పక్కకు లాగి పడేశారు. ఈ క్రమంలో గుడిసె వాసుల వంట సామాగ్రి, మంచాలు దుప్పట్లు చల్లా చెదురయ్యాయి. తోపులాటలో కొంతమంది కింద పడిపోయి అస్వస్థతకు గురయ్యారు. ఫోన్లను కూడా అధికారులు లాక్కున్నారు. తాగునీటి అవసరాల కోసం తొవ్వకున్న తాగునీటి బావులను, చెలిమెలను డోజర్లతో మూసివేయించారు. కొంతమంది అధికారులు పేదలను భయభ్రాంతులకు గురి చేశారు. మీరు ఎన్నిసార్లు గుడిసెలు వేసినా తొలగిస్తామన్నారు. అవసరమైతే భాష్ప వాయువులు, వాటర్ క్యాన్లు ప్రయోగిస్తామని హెచ్చరించారు. సెంటు భూమైనా మీకు దక్కనీయమని హెచ్చరించారు. బాధితులు మాత్రం భూమిని వదిలేది లేదంటూ ఎక్కడికి అక్కడ పిల్లలతో వృద్ధులతో చెట్ల కింద బైఠాయించారు.

దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సమయంలో పేదలపై దాడులా : అధికార యంత్రాగంపై సిపిఎం ఆగ్రహం

జిల్లాలో దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సమయంలో అధికారం యంత్రాంగం పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేయడం దారుణమని సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదల గుడిసెల కూల్చివేతను సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు జి నాగయ్య జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్జపు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, సమ్మెట రాజమౌళి తీవ్రంగా ఖండించారు. పేదల గుడిసెలు తొలగింపు అమానుషమని, అక్రమం అని విలేకరుల సమావేశంలో నాగయ్య విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఎస్‌సి, ఎస్‌టి, బిసిల్లోనే పేదలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని విమర్శించారు. పేదలకు అండగా ఉండాల్సిన అధికారులు రియల్ ఎస్టేట్ యాఫియాకు మద్దతు ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి, ఎమ్మెల్యే అండదండలతోనే రియల్‌ఎస్టేట్ మాఫియా రెచ్చిపోతోందని అన్నారు. పేదల గుడిసెలు తొలగింపునకు ఆదేశించిన ప్రజాప్రతినిధులకు భవిష్యత్తు లేదని, ప్రజల ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- వార్డు కార్యాలయాల ప్రారంభంతో ప్రజలతో మమేకమయ్యే అవకాశం
- కార్పొరేటర్లకు మంత్రి కెటిఆర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో అమలయ్యే సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలు యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఐటీ, పరిశ్రమల మంత్రి కె. తారకరామారావు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ విజయం ఖాయమని అభిప్రాయపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్లతో మంత్రి మంగళవారం ప్రగతిభవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు హైదరాబాద్ నగర అభివృద్ధికి పాటుపడుతున్న తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కార్పొరేటర్లకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిహెచ్‌ఎంసి వార్డు కార్యాలయాలను 16న ప్రారంభిస్తున్న నేపథ్యంలో సుపరిపాలన మరింత బలోపేతమవుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలను, ప్రభుత్వ కార్యక్రమాలను వేగంగా అందించాలన్న ఉద్దేశంతో పరిపాలన వికేంద్రీకరణ సంస్కరణలను సిఎం కెసిఆర్ చేపట్టారని తెలిపారు. ఈ ఆలోచనా దృక్పథంలోంచి జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల, మండల కేంద్రాలు, గ్రామపంచాయతీలను నూతనంగా ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల ఇంటి ముందట నిలిపేందుకు ప్రయత్నం చేశామన్నారు. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు, వార్డు కార్యాలయ వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కోరారు. వార్డు కార్యాలయ వ్యవస్థపై అవగాహన కోసం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ల కోసం సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16న జరిగే వార్డు కార్యాలయ ప్రారంభోత్సవాలకు తమ పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వార్డులోని ప్రముఖ వ్యక్తులు, సంఘాలతో ఏకమై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ తరపున నిర్వహించే సమావేశాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని, పార్టీ బలోపేతం ద్వారానే మనం మరొకసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భరోసా కల్పించారు. రానున్న సంవత్సర కాలం పాటు పార్టీ కార్యకలాపాలు విస్తృతంగా ఉంటాయని, వాటన్నింటిని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని కార్పొరేటర్లకు సూచించారు. సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు నవీన్ రావు, శంబిపూర్ రాజు, మేయర్ విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తోపాటు ఇతర సీనియర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లీగల్ నోటీసుల ఉపసంహరణ ప్రశ్నేలేదు

- అధికారులు, సంస్థ పనితీరుపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఆక్షేపణీయం : హెచ్‌ఎండిఎ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ఎంపి రేవంత్ రెడ్డికి జారీ చేసిన లీగల్ నోటీసును ఉపసంహరించుకునే ప్రశ్నే లేదని హెచ్‌ఎండిఎ స్పష్టం చేసింది. అధికారులు, సంస్థ పనితీరుపై అపోహలు, రాజకీయ ఉద్దేశాలను ప్రస్తావిస్తూ ప్రత్యేకంగా అధికారుల పేర్లను అభ్యంతరం వ్యక్తం చేయడం హెచ్‌ఎండిఎ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎమ్‌డీఏ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వానికి లోబడి, ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్‌ఎండిఎ పనిచేస్తోందని పేర్కొంది. ఎన్‌హెచ్ఎఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) టాట్ బిడ్ కోసం నిర్దేశించిన నిబంధనలను అనుసరించి ఒఆర్ఆర్ టాట్ బిడ్ ప్రక్రియ అత్యంత పారదర్శంగా నిర్వహించినట్టు చెప్పింది. 30 ఏండ్ల టాట్ బిడ్ మంత్రి మండలి నిర్ణయానికి అనుగుణంగా ఉందని, ఎన్‌హెచ్ఎఐ రెండు బిడ్‌లు 30 ఏళ్ల కాలానికి ఖరారు అయ్యాయని, టాట్ చేయడం ఇది మొదటిసారి కాదని హెచ్‌ఎండిఎ స్పష్టం చేసింది. ఎంపి రేవంత్ రెడ్డి ఆర్‌టిఐ ప్రశ్నలకు సకాలంలో వివరాలు ఇచ్చామని పేర్కొంది.

శిరీషది హత్యా..? ఆత్మహత్యా..? తేలాల్సి ఉంది

- దర్యాప్తు తర్వాతే వివరాలు వెల్లడి : ఎస్‌పి కోటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలో సంచలనం రేపిన శిరీష (19) మరణం హత్యా? ఆత్మహత్యా? ఇంకా తేలలేదని వికారాబాద్ ఎస్‌పి కోటిరెడ్డి తెలిపారు. పూర్తి దర్యాప్తు తర్వాతే ఎలా చనిపోయిందో వెల్లడిస్తామన్నారు. దర్యాప్తులో భాగంగా ఆయన మంగళవారం మృతురాలి స్వగ్రామం వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ వెళ్లారు. శిరీష ఇల్లు, చనిపోయిన స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందడానికి ముందు ఇంట్లో జరిగిన గొడవపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. శిరీష ఒంటిపై గాయాల ఆధారంగా పోస్టుమార్టం పూర్తి చేసినట్లు ఎస్‌పి తెలిపారు. ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

బయటి వ్యక్తులు హత్య చేశారా? ఇంట్లో వాళ్లా?.. అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. సెల్‌ఫోన్ విషయంలో బావ అనిల్‌తో గొడవ పడినట్లు తెలిసిందన్నారు. ఇంట్లోనే ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఫోన్‌లాక్ ఉన్నందున సైబర్ క్రైమ్‌కు పంపించి డేటా తీయిస్తామని చెప్పారు. ఫోన్ డేటా, ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు, సాంకేతిక ఆధారాల ద్వారా కేసు ఛేదిస్తామని ఎస్‌పి కోటిరెడ్డి వివరించారు.

మహిళా సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి-హైదరాబాద్
తెలంగాణ లో మహిళ కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అనుసరణీయం అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పాలకునికి తల్లి తండ్రి లాంటి మనస్సు ఉంటే ప్రజల .ముఖ్యంగా సమాజంలో స్త్రీల సంక్షేమం కోసం కృషి జరుగుతోందని అట్టి పాలకుడు కెసిఆర్ అని సత్యవతి కొనియాడారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణా ఆవిర్భావం తరువాత తొమ్మిది వత్సరాలలో మహిళలు స్వయం సమృద్ధి చెందేందుకు సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు గత కాలములో లెవన్నారు. రోహిణిలో కూడా నీళ్ల బిందెలు పట్టుకొని. మహిళలు రోడ్డుపై నిలబడే దృశ్యాలు నేడు లేవన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ ఇస్లాం మతంలో స్త్రీ సంక్షేమానికి భద్రత కు అధిక ప్రాధాన్యత నిస్తుందని దేశంలోనే

షే టీం మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఐఎఎస్, ఐపిఎస్ మహిళా అధికారులకే ప్రాధాన్యత మన రాష్ట్రం లోవుందన్నారు. రాష్ట్ర మహిళ కమిషన్ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డి, పశుసంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు వివరించారు. మహిళ అధికారులు స్మిత సబర్వాల్, శిఖ గోయల్, ప్రియాంక, భారతి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ప్రజా సంఘాల పోరాట వేదిక బస్సుయాత్ర

- పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఇళ్లులేని పేదలకు ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య తెలిపారు. మంగళవారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన బస్సు యాత్ర వివరాలు వెల్లడించారు. 18న మహబూబాబాద్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ఈ యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా

పాల్గొంటారన్నారు. బస్సు యాత్ర కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, గోదావరి ఖని, చెన్నూర్, కోరుట్ల, నిజామాబాద్, బిక్కునూర్, మెదక్, సంగారెడ్డి, పరిగి, అమరచింత, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో పర్యటిస్తుందని పేర్కొన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న తహసీల్దార్లకు దరఖాస్తులు చేస్తూ, ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. 27న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగింపు సభ జరుగుతుందన్నారు. దీనిలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. జులై 3న పెద్ద సంఖ్యలో పేదలను కదిలించి అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద మహాధర్నాలు చేపట్టి, పేదల గొంతును ప్రభుత్వాలకు వినిపించేలా చేస్తామని తెలిపారు. పదిరోజులపాటు 19 జిల్లాల్లో 61 గుడిసెవాసుల కేంద్రాల్లో యాత్రా బృందం పర్యటించి, వారిలో చైతన్యం నింపేలా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఇళ్లులేని పేదల వివరాలతో ప్రత్యేక సర్వే చేస్తామని తెలిపారు. భవిష్యత్ పోరాటాలకు వారిని సమాయత్తం చేసేలా పలు బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఇండ్లులేని పేదలు 30 లక్షల మంది ఉన్నారనేది అధికారిక లెక్క అనీ, వారి సమస్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు పరిష్కరించట్లేదని వీరయ్య ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయనేతలు కబ్జాలు చేస్తున్నారనీ, జీవో నెంబర్ 59తో అలాంటి భూముల్ని క్రమబద్ధీకరిస్తున్నారని చెప్పారు. పేదలు వంద గజాల జాగా కోరితే, వారిని కబ్జాదారులని ముద్రవేసి, తీవ్రమైన పోలీసు నిర్బంధం కొనసాగిస్తున్నారని తెలిపారు.

పేదలపై లాఠీఛార్జీ దారుణం : వ్యకాస

హైదరాబాద్ బ్యూరో : మహబూబాబాద్ పట్టణంలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలపైనా, మహిళలపైనా పోలీసులు లాఠీఛార్జీ చేయడం దారుణమనీ, ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. గుడిసెలను కూల్చటం, తాగునీటి బావులను పూడ్చేయటం, అడ్డువచ్చిన వారిని కొట్టడం అన్యాయమని పేర్కొన్నారు.

మహారాజశ్రీ అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 173/2022
Between:
గుబ్బల సూర్యప్రకాష్ రావు ... వాది
And
1.కట్టా కాశీ విశ్వనాథం S/o లేట్ సుబ్బరాజు
H.NO B-3/24, తిరుమల గుడ, హైదరాబాద్
తెలంగాణ.
... 1వ ప్రతివాది
ఈ నెంబరు దావా మరియు ఇంజంక్షన్ I.A 499/2022 నెంబరున 1వ రెస్పాండెంట్ ప్రతి వాదికి దావా సమన్లు నోటీసులు ఎన్ని పర్యాయములు కోర్టు మరియు పోస్టు ద్వారా పంపినప్పటికీ సదరు 1వ రెస్పాండెంట్ కి అమలు జరుగనందున ఇందు మూలముగా దావా సమన్లు నోటీసు నిమిత్తం ది. 19-6-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు వాయిదా అయిఉన్నందున సదరు తేదీని స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించదమగును.
శ్రీ మాకిరెడ్డి ఆదినారాయణ B.A,, B.L
వాది తరుపు అడ్వకేటు
అమలాపురం

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
A.S.No.96/2019
Between:
N.Ramana nanda Reddy ...Appellant
And
1.N.Harinath 2.N.Sreenivasulu ...Respondents
Notice to Respondent No.1
R1: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు అప్పీలులో 1వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 20-06-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
A.S.No.97/2019
Between:
N.Sapthagiri Reddy ...Appellant
And
1.N.Harinath 2.N.Sreenivasulu ...Respondents
Notice to Respondent No.1
R1: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు అప్పీలులో 1వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 20-06-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
A.S.No.98/2019
Between:
N.Prakash Reddy died by L.Rs. N.Prahallada Reddy ...Appellant
And
1.N.Harinath 2.N.Sreenivasulu ...Respondents
Notice to Respondent No.1
R1: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు అప్పీలులో 1వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 20-06-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
A.S.No.100/2019
Between:
N.Yerrappa Reddy ...Appellant
And
1.N.Harinath 2.N.Sreenivasulu ...Respondents
Notice to Respondent No.1
R1: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు అప్పీలులో 1వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 20-06-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
A.S.No.101/2019
Between:
N.Sapthagiri Reddy ...Appellant
And
1.N.Harinath 2.N.Sreenivasulu ...Respondents
Notice to Respondent No.1
R1: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు అప్పీలులో 1వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 20-06-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

ప్రశ్నను నిరోధించగలమా?

- సమాచార సేకరణ గగనమే
- మీడియాపై ప్రభుత్వాల ఆంక్షలు
- ప్రజల గొంతుక వినపడకుండా అడ్డగింత
- జర్నలిస్టుల్లో పెరుగుతున్న అసహనం, ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తూ వార్తలు రాయడంలేదేంటి? వ్యతిరేక వార్తలు, సద్విమర్శలు చేస్తేనే కదా మాకు(పాలకులకు) మంచి, చెడు తెలిసేది" అని దేశ తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒకానోక సందర్భంలో మీడియా సమావేశంలో పాత్రికేయులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అక్కడోక ప్రెస్‌మీట్ జరుగుతోంది. వరుసగా విలేకర్లు ప్రశ్నలు అడుగుతున్నారు. ఓ ఉన్నతాధికారి సమాధానాలు చెబుతున్నారు. మధ్యలో కూర్చున్న ఒక జర్నలిస్టు మాత్రం ప్రశ్న వేయకుండా మౌనంగా ఉన్నాడు. 'నువ్వు ప్రశ్న అడగవా..? మరీ ఎందుకొచ్చావ్' అని ఎదురు ప్రశ్నించాడా పెద్దాయన సదరు విలేకరిని వేలితో చూపిస్తూ. ఆయన ఎవరో కాదు. టిఎన్ శేషన్. భారత ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి. గతంలో ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతు అన్న మాటలు.

ఈ రెండు సందర్భాలు ప్రశ్న ప్రాధాన్యతను, మీడియా ఔన్నత్యాన్ని తెలియజేసే ఘటనలే. తార్కాణాలే. అరచేయిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపగలమా? ఆంక్షలను ప్రయోగించి మీడియాను, దాని ప్రశ్ననూ నిరోధించగలమా? ఇది నేటి మిలియన్ డాలర్ల ప్రశ్న.

నేడు దేశంలో, రాష్ట్రంలో మీడియా ఉనికిని ప్రశ్నార్థకం చేసే ప్రభుత్వాలు పరిపాలిస్తున్నాయి. కార్పొరేట్ల కబంధ హస్తాల్లో చిక్కుకున్న మీడియా, జర్నలిజం మూల సూత్రాలను దెబ్బతీస్తుండగా, ప్రభుత్వాల విధానాలు అశేష జనవాహిని తరపున గళమెత్తకుండా దాని గొంతును నొక్కే ప్రయత్నాలు చేస్తున్నాయి. వెరసి ప్రసార, పత్రికా సాధనాలతోపాటు అందులో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఉద్యోగుల్లో ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతోంది. విధులు నిర్వర్తించడానికి కావాల్సిన కీలకమైన 'సమాచారం' గడపదాటకుండా, ప్రజల సన్నిధికి చేరకుండా నియంత్రిస్తున్నాయి. కాదు కాదు బాజాప్తా అడ్డుకుంటున్నాయి. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే మీడియా పట్ల , జర్నలిస్టుల పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నాయి. ఇంకో మాటలో చెప్పాలంటే బహిరంగంగానే అణచివేతకు పాల్పడుతున్నాయి. భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు తూట్లు పొడుస్తున్నాయి. అధికారంలోకి రాగానే అంతా తామే అనే భావన, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలపై అలవికాని పెత్తనం ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణమవుతున్నాయి. చట్టాలను సైతం చేతుల్లోకి తీసుకుని అపరిమిత అధికారాలను చెలాయిస్తూ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పత్రికలు, ప్రసారసాధనాలు, జర్నలిస్టులు, ప్రజాసంఘాలపై ఒంటికాలిమీద లేస్తున్నాయి. 'పరులకు పండ్లె, తాము పుండ్లె'నట్టుగా ఉంది మీడియా , జర్నలిస్టుల పరిస్థితి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కల్పిస్తున్న స్వేచ్ఛను సైతం వినియోగించుకోనివ్వకుండా అడ్డుపడుతున్నాయి. దౌర్జన్యానికి దిగుతున్నాయి. ఏమంటే మీడియాకు వాణిజ్య ప్రకటనలు ఆపేయడం, ఒకవేళ ఇచ్చినా బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టి వేధిస్తున్నాయి. మా దయాదాక్షిణ్యాలపైనే మీ మనుగడ అన్నట్టుగా ఘీంకరిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లోకి మీడియాని, జర్నలిస్టులను అనుమతించడం లేదు. కలం గళాన్ని ప్రజలకు వినిపించే అవకాశం లేకుండా కంచెలు వేస్తున్నాయి. కేంద్రంతోపాటు రాష్ట్రంలోనూ ఇదే దుస్థితి. సోషల్‌మీడియాను ఉపయోగించుకుకని అధికారంలోకి వచ్చిన బిజెపి గానీ, ప్రజల ఆకాంక్షను గొంతెత్తి, కొట్లాడి మరీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్‌గానీ మీడియాకు సరైన ప్రాధాన్యత, గౌరవం ఇవ్వకపోవడం గమనార్హం. తెలంగాణ ఉద్యమంలో మీడియా పాత్ర ఇక్కడ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదనుకుంటా. తాము చెప్పిందే రాయాలంటున్నాయి. అదే వేదమంటున్నాయి. పత్రికా ప్రకటనలకే పరిమితం చేస్తున్నాయి. యాజమాన్యాలు చెప్పినట్టు రాయకపోతే ఒక సమస్య, రాసుకుంటూ పోతే మనస్సాక్షితో అంతర్గత పోరాటమే. అడకత్తెరలో పోకచెక్కలా మారింది పాత్రికేయుల జీవనం. నిరంతరం 'నిజం' కోసం అన్వేషిస్తూ ప్రజల గొంతుక కావాల్సిన మీడియా, అవాస్తవాలను సాగుచేస్తూ సాగిపోతున్న దారుణ కాలమిది. ఇటీవల దేశంలోని మీడియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు జర్నలిస్టులకు మింగుడుపడేవి కావు. అంతేగాక సమాజానికి చేటు చేసేవి. ఢిల్లీలో ప్రధాని ప్రెస్‌మీట్ అసలే పెట్టరు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో ప్రశ్నించే జర్నలిస్టులను హేళన చేస్తారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లోకి రాకుండా మీడియాను బిజెపి సర్కారు నిషేధించింది. రాష్ట్రంలో సచివాలయంలోకి జర్నలిస్టులను అడుగుపెట్టనివ్వడం లేదు. సచివాలయం సాయంత్రం సమయాల్లో పాసులు తీసుకోవాల్సిందేనని అంటున్నారు. కొత్త సచివాలయంలో ప్రారంభోత్సవం రోజున స్టేట్ మీడియాను పూర్తిస్థాయిలో పర్మిట్ చేయకపోవడం తెలిసిందే. ఆయా అంశాలు, ప్రజా సమస్యలపై రాతలు, ప్రసారాల ద్వారా ఎదిరించినా, నిలదీసినా ఆయా సంస్థల ఆర్థిక మూలాలపై ప్రభుత్వాలు దెబ్బకొడతాయి. ఆ ప్రభావం ఆయా వ్యవస్థల్లో పనిచేసే వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలపై పడుతోంది

ప్రభుత్వాలు తామిచ్చిన అక్రిడిటేషన్ కార్డులకూ కొంచెమైనా విలువ ఇవ్వని పరిస్థితి. పాత సచివాలయంలో ఉన్నప్పుడు అంటే 2015 నుంచే పాత్రికేయులకు పరిమితులు విధిస్తూ విధినిర్వహణ సక్రమంగా చేయకుండా ఆటంకాలు సృష్టిస్తున్న వైనం సమాజానికి తెలియనిది కాదు. గతంలో ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు పత్రికలు, ప్రసారసాధనాలకు ఇంటర్వ్యూలు ఇచ్చేవారు. ప్రజల తరపున మీడియా, జర్నలిస్టులు వేసే పశ్నలకు సమాధానం చెప్పేవారు. ఇప్పుడది గతమే అవుతోందితోంది. ఇస్తే, గిస్తే తమకు అనుకూల మీడియాకు ఇవ్వడం, ప్రజా మీడియాను నిర్లక్ష్యం చేయడం జరుగుతున్నది. లేదంటే ప్రయివేటు ఏజెన్సీల ద్వారా పత్రికలు, ప్రసారమాధ్యమాలకు ప్రెస్ నోట్లు పంపించడం అలవాటు చేసుకున్నాయి. ప్రజా కోణంలో వార్తలకు అవకాశం లేకుండా చేస్తున్నాయి. ఈనేపథ్యంలో రాజ్యాంగంలోని నాలుగో స్థంభానికి తీవ్ర గాయాలు అవుతున్నాయి. ఇది సమాజానికి మేలుచేసేది కాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలకు మీడియా అవసరం ఉంటుంది. అధికారంలోకి వచ్చాక అది తీరిపోతుంది. ఈ పరిస్థితి తొలుత ప్రజలకు నష్టం కలిగిస్తుంది. అంతిమంగా ప్రభుత్వాలకూ నష్టమేనని విశ్లేషకులు వ్యాఖ్యానించడం గమనార్హం.

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించనట్టే

ప్రజాస్వామ్యంలో సమాచారం ప్రజాబాహుళ్యంలోకి స్వేచ్ఛగా వెళ్లాలి. అందుకే ఆర్‌టిఐ చట్టం వచ్చింది. పారదర్శకంగా ఉండేందుకే. సమాచారం అడిగినా ఇవ్వాలి. జిఒలు కాన్ఫిడెన్షియల్ అంటూ దాచిపెడుతున్నారు. అధికారులను కలవకుండా జర్నలిస్టులు అడ్డుకోవద్దు. సచివాలయంలోకి స్వేచ్ఛగా వెళ్లేలా పరిస్థితులు ఉండాలి. సామాన్య ప్రజలకూ ఆ అవకాశం తప్పనిసరి. అడ్డుకోవడంలో అర్థం లేదు. నిజంగా ప్రజాసేవ చేసే ప్రభుత్వాలు మీడియాను స్వాగతించాలి. అలా చేయకపోతే ప్రజాహితమైన పనులు చేయడం లేదని భావించాల్సి వస్తుంది. రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడం లేదని అర్థమవుతుంది.

సాక్షి, మాజీ ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్ ఆర్ దిలీప్‌రెడ్డి

ప్రభుత్వాలకే నష్టం

మీడియాను, జర్నలిస్టులను ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లనివ్వకపోవడం ప్రజలతోపాటూ ప్రభుత్వాలకూ నష్టమే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీడియా కావాలి. అధికారంలోకి వచ్చాక వద్దనుకుంటున్నారు. ఇది సరికాదు. సచివాలయంలోకి జర్నలిస్టులను అనుమతించకపోవడం మంచి పరిణామం కాదు. ఈ వ్యవహారంపై జరగాల్సిన స్థాయిలో చర్చ ఉండటం లేదు. ఈపరిస్థితి మారాలి. (ఇటీవల తెలుగు యూనివర్సిటీ జర్నలిజం పీజీ విద్యార్థులు విడ్కోలు కార్యక్రమంలో వ్యాఖ్యలివి)

ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్

నియంత్రణ సమంజసం కాదు

సమాచారం స్వేచ్ఛగా ప్రజలకు చేరాలి. అందుకు అవకాశముండాలి. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేది మీడియానే. అలా చేయడం మూలాన నష్టం జరుగుతుంది. ఈ సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలి. తెలంగాణ కోసం మీడియా చేసిన కృషి అందరికీ తెలిసిందే.

ప్రొఫెసర్ డాక్టర్ కె నాగేశ్వర్

స్వేచ్ఛను అడ్డుకోవద్దు

ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరింపచేయాల్సిన గురుతర బాధ్యత మీడియాపైనే ఉంది. ఆ తరుణంలో 'నో' ఎంట్రీ అంటే ఎలా ? ప్రజల చేత ఎన్నికైనా ప్రభుత్వాలు, ప్రజలకు జవాబు దారిగా ఉండాలి. ప్రజలకు ప్రాతినిధ్యం వహించేది మీడియా. అంటే మీడియాకు జవాబుదారిగా ఉండాల్సిన అవసరం ఉంది. మీడియాకు సమాచారం ఇవ్వకుండా అడ్డుకుంటే, ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసినట్టే. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లోకి మీడియాను గతంలో అనుమతించేవారు. ఇప్పుడు ఆ అవకాశాన్ని బీజేపీ సర్కారు రద్దు చేసింది. ఇది ఏమాత్రం సరైందికాదు.

బి బసవపున్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిడబ్ల్యుజెఎఫ్

ప్రాణం తీసిన శ్రీరామ్ చిట్‌ఫండ్ జమానాత్

- ఇఎంఐ కట్టకపోవడంతో జమానాత్ అకౌంట్ నుంచి డబ్బులు డ్రా
- అవమానంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిట్టి ఎత్తుకున్న వ్యక్తి నెలసరి ఇఎంఐ కట్టకపోవడంతో.. అతనికి జమానత్ ఉన్న మరో వ్యక్తి అకౌంట్‌లో నుంచి చిట్టి వ్యాపారులు డబ్బులు డ్రా చేయడంతో ఆ వ్యక్తి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సిఐ రౌతు గోపి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణంలోని బిటిఎస్ దుర్గా కాలనీకి చెందిన పప్పుల ఓం ప్రకాష్ (53) నల్లగొండ మున్సిపాలిటీలో వాటర్ పిట్టర్ పనిచేస్తున్నాడు. అదే ఆఫీసులో పనిచేస్తున్న సహ ఉద్యోగి చింత ఎల్లయ్యకు శ్రీరామ్ చిట్‌ఫండ్‌లో జమానత్ ఉన్నాడు. ఎల్లయ్య చిట్టి నెలసరి ఇఎంఐ కట్టకపోవడం వల్ల, జమానత్ ఉన్న ప్రకాష్ ఎకౌంట్ నుంచి చిట్టి వ్యాపారులు రూ. పది వేలు కట్ చేసుకున్నారు. ఈ విషయంపై ఎల్లయ్యను ప్రకాష్ నిలదీసినా స్పందించలేదు. కాగా, ప్రెగ్నెంట్ అయిన ఆయన కూతుర్ని అతని భార్య మెడికల్ చెకప్‌ల కోసం సోమవారం హైదరాబాద్ తీసుకెళ్లింది. దాంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రకాష్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ప్రకాష్ తలుపు తీయకపోవడంతో ఆయన కుమారుడు చరణ్ తేజ్ అనుమానంతో డోరు సందులోంచి చూడగా ప్లాస్టింగ్ ప్యాకింగ్ వైరుతో ఫ్యానుకు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. దాంతో కుమారుడు మరొక డోర్ ఓపెన్ చేసి చూసేసరికి అప్పటికే ఆయన మృతిచెంది ఉన్నాడు. ప్రకాష్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రైతులకు సంకేళ్లు వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) భూ నిర్వాసితులపై అక్రమ కేసులు బనాయించారని ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. కోర్టు బెయిల్ ఇచ్చినా వారికి చేతులకు బేడీలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సంకేళ్లు వేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూసేకరణ పేరుతో బలహీన వర్గాలు, దళితుల భూములను బలవంతంగా తీసుకుంటున్నదని తెలిపారు. గవర్నమెంట్ భూములు తీసుకోకుండా రైతుల దగ్గర ఉన్న ఎకరం, రెండెకరాల భూమిని గుంజుకుంటున్నారని తెలిపారు. వారసత్వంగా వస్తున్న కొద్దిపాటి భూమి పోతోందన్న బాధతో భువనగిరి, రాయగిరితోపాటు మిగిలిన గ్రామాల రైతులు పోరాటం చేస్తున్నారని వివరించారు. రైతులపై నమోదు చేసిన కేసును బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఏ మొఖం పెట్టుకుని ఖమ్మానికి వస్తున్నారు?

- ఆ నైతిక అర్హత మీకు లేదు
- అమిత్ షాపై కూనంనేని ఫైర్
- ధరణిపై అఖిలపక్షం నిర్వహించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఖమ్మం వచ్చి మాట్లాడే నైతిక అర్హతే లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఎన్ బాలమల్లేశ్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ తెలంగాణకు పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను పక్కన పడేసి అమిత్‌షా ఇప్పుడు ఇక్కడికొచ్చి ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా వామపక్షాల ఖిల్లా అనీ, ఇక్కడ కాషాయపార్టీ వలకు చిక్కే చాపలు లేవన్నారు. విషం కక్కే పాములు కూడా కాలకూటంలాంటి విషం చిమ్మే బిజెపికి భయపడుతున్నాయని ఎద్దేవా చేశారు. అంగట్లో సరుకు లాగా ఎవరో ఒకరు దొరకకపోతారా?అనే ఉద్దేశంతో ఖమ్మానికి అమిత్ షా వస్తున్నారని తెలిపారు. ఆయన పార్టీ ఆటలు ఇక్కడ సాగబోవని హెచ్చరించారు. తొమ్మిదేళ్లుగా ప్రజల సమస్యలు పట్టించుకోని బిజెపి సర్కార్.. దేశాన్ని దక్షిణ, ఉత్తర ప్రాంతాలుగా విభజించాలని కుట్రలు చేస్తోందన్నారు. మోడీ, అమిత్ షా కవలపిల్లలని విమర్శించారు. వీరిద్దరు కలిసి దేశాన్ని అదోగతిపాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

'ధరణి' పోర్టల్‌ను ఎత్తివేయాలనే వాదనను తాము సమర్థించడం లేదనీ, అందులో ఉన్న లోటు పాట్లను సరిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అసెంబ్లీలో సీఎం ప్రకటించిన విధంగా పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలన్నారు. వారి సమస్యలపై పోరాడుతామని చెప్పారు. సింగరేణి ఆదాయ వ్యవయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనీ, వారికి ఇండ్లు ఎందుకు నిర్మించి ఇవ్వటంలేదో చెప్పాలని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా బిఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చామనీ, ఆ పొత్తు యథాతథ స్థితిలో ఉనట్లుగా తాము భావిస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా కూనంనేని చెప్పారు. బిజెపిపై పోరాటానికి కేసీఆర్ నాయకత్వం వహించాలనీ, ఆ విషయంలో ఆయన మెత్తబడితే తమ విశ్వాసం సన్నగిల్లుతుందని చెప్పారు. సీఎం అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదా? అన్న ప్రశ్నకు తాము అపాయింట్ మెంట్ అడగలేదు, వారు ఇవ్వలేదని చెప్పారు. ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం కలిసే పోతాయని చెప్పారు. అజీజ్ పాషా మాట్లాడుతూ బాలాసోర్ రైలు రైలు ప్రమాదం విషయంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు.

కరీంనగర్ ఆఒబి నిర్మాణ వ్యయం కేంద్రానిదే

- తమ ఘనత అని బిఆర్ఎస్ చెప్పుకోవడం దారుణం : బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తీగలగుట్ట సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఒబి) టెండర్ల ఖరారు తమ ఘనతగా చెప్పుకుంటూ బీఆర్ఎస్ నేతలు సీఎంకు పాలాభిషేకం చేయడాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ తప్పుపట్టారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్ఒబి నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం రూ.126.74 కోట్లను కేంద్రమే చెల్లించేందుకు అంగీకరించిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అనేకసార్లు తాను ప్రభుత్వానికి లేఖలు రాసిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పనులను తాత్సారం చేస్తుండటంతో బిజెపి నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ ఖర్చులో 80 శాతం రాష్ట్రం భరిస్తుందని చెప్పి తర్వాత మాట మార్చింది వాస్తవం కాదా? అని అడిగారు. సొమ్ము కేంద్రానిదైతే... సోకు బిఆర్ఎస్ నేతలది అన్నట్టుగా పరిస్థితి ఉందని తెలిపారు. ఆర్ఒబి నిర్మాణం విషయంలో జరుగుతున్న జాప్యానికి తామే కారణమంటూ బిఆర్ఎస్ నేతలు కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

18న ఐస్‌క్రీమ్ ఛాలెంజ్

- రూ.5 లక్షలు గెలుచుకునే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఈ నెల 18న ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టెస్టింగ్ ఛాలెంజ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైబిజ్ టివి నిర్వహిస్తున్న ఈ పోటీకి విజయ తెలంగాణ ఐస్‌క్రీం టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహారిస్తోంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో విజయ డైరి తెలంగాణా చైర్మన్ సోమ భరత్ కుమార్, హీరోయిన్ కిషోర్ దత్రక్, హైబిజ్ టివి సిఇఒ సంధ్యారాణి, ఎండి రాజగోపాల్, ఐస్‌క్రీం కన్సల్టెంట్ నజ్మూల్ హుడా ఆవిష్కరించారు. హైటెక్స్‌లో నిర్వహించనున్న ఐస్ క్రీం టెస్టింగ్ ఛాలెంజ్ 2వ ఎడిషన్‌లో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచిన విజేతకు లక్ష రూపాయల క్యాష్ ప్రైజ్ ఇస్తారు. దాంతో పాటు రూ. 40 వేల విలువైన డొమెస్టిక్ హాలిడే ట్రిప్ ప్యాకేజీ దక్కుతుంది. రెండో బహుమతిగా రూ.50వేలతో పాటు 25వేల డొమెస్టిక్ హాలిడే ట్రిప్ ప్యాకేజీ సొంతం చేసుకోవచ్చు. మూడవ బహుమతిగా రూ.25 వేలతో పాటు 20 వేల విలువైన డొమెస్టిక్ హాలిడే ట్రిప్ ప్యాకేజీ దక్కుతుంది. నాలుగవ బహుమతి గా 10 మంది విజేతలకు 5వేల చొప్పున క్యాష్ ప్రైజ్, రూ. 15 వేల విలువగల డొమెస్టిక్ హాలిడే ట్రిప్ అందించనున్నారు.

అబ్జర్బిలిటీ కాన్ఫరెన్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

హైదరాబాద్ : రెండవ ఇండియా డేటా అబ్జర్వేబిలిటీ కాన్ఫరెన్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. జూన్ 16న జరగనున్న ఈ సమావేశానికి నగర చుట్టుపక్కల ఉన్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీలకు చెందిన సీనియర్ డేటా ఇంజనీర్లు, డేటా లీడర్‌లు, ఆర్కిటెక్ట్‌లు, డేటా ఆపరేషన్స్ ఇంజనీర్‌లతో సహా 200 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని హోస్ట్ అన్‌రావెల్ డేటా, నిర్వాహకులు వెల్లడించారు. ఈ కాన్ఫరెన్స్‌లో 14 మంది అత్యంత నిపుణులైన స్పీకర్లు డేటా పరిశీలన, క్లౌడ్ డేటా ఖర్చు నిర్వహణ అనేది దానిపై మాట్లాడనున్నారని తెలిపారు.

పొల్యూషన్ టెస్టింగ్ ఫీజు పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాహనాల పొల్యూషన్ టెస్టింగ్ పరీక్ష ఫీజును పెంచాలని నిర్ణయించినట్టు తెలంగాణ రవాణాశాఖ ప్రకటించింది. ఇక నుంచి వాహనాన్ని పరీక్షించి సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు ద్విచక్రవాహనానికి రూ.50, పెట్రోల్ త్రీవీలర్స్‌కు రూ.60, పెట్రోల్ కార్లకు రూ.75, డీజిల్ కార్లకు రూ.100, డీజిల్‌లో ఇతర కేటగిరీ వాహనాలన్నింటికీ రూ.100 చొప్పున ఫీజు వసూలు చేయనున్నట్టు రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రవాణాశాఖ జిఒ నెంబర్ 23ను విడుదల చేసింది. ప్రస్తుతం ఏడేళ్ల క్రితం ఉన్న ఛార్జీలనే అమలు చేస్తున్నారని, ఈ ఏడేళ్లలో వేతనాలు, ఇతర వ్యయాలు పెరిగాయని.. అందుకే పొల్యూషన్ టెస్టింగ్ ఫీజు పెంచుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్రంలో మరో 17 గురుకుల డిగ్రీ కాలేజీలు : మంత్రి గంగుల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో 17 బిసి గురుకుల డిగ్రీ కాలేజీలను ప్రభుతం మంజూరు చేసిందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. వెనుకబడిన వర్గాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన చెప్పారు. నూతన బిసి గురుకుల డిగ్రీ కాలేజీలకు త్వరలోనే పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతుల ప్రారంభానికి సిఎం, సంబంధిత శాఖ మంత్రి ఆదేశాలతో అన్ని చర్యలు తీసుకుంటున్నామని బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అదే ప్రకటనలో తెలిపారు. గతంలో వర్గల్ కాలేజీకి అదనంగా 2022 - 23 విద్యా సంవత్సరంలో నూతనంగా 15 గురుకుల డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేసి క్లాసులను ప్రారంభించాలని గుర్తుచేశారు. ఇందులో రెండు వ్యవసాయ డిగ్రీ కాలేజీలున్నాయని తెలిపారు. తాజాగా జిల్లాకొక డిగ్రీ కాలేజీకి సీఎం అనుమతులనిస్తూ మరో 17 డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయడంతో బిసిలకు నాణ్యమైన విద్య అందుతున్నదని తెలిపారు.

లీగల్ నోటీసు వెనక్కి తీసుకోవాలి

- లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు
- ఐఎఎస్ అరవింద్‌కుమార్‌కు రేవంత్ రెడ్డి హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) టెండర్ వ్యవహారంలో రాజకీయ నాయకుడి మాదిరిగా ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ వ్యవహరిస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. అడిగిన సమాచారమివ్వకుండా రాజకీయ నాయకుడిగా ఎదురు దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ లీజుకు సంబంధించిన వ్యవహారంలో ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ మే25న తనకు ఇచ్చిన లీగల్ నోటీసులను వెనక్కి తీసుకోకుంటే, ఆయనపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓఆర్ఆర్ లీజుకు సంబంధించిన వ్యవహారంలో అరవింద్ కుమార్ పంపిన లీగల్ నోటీసుకు రేవంత్ తన అడ్వకేట్ ద్వారా మంగళవారం రిప్లై ఇచ్చారు. 'అరవింద్ కుమార్ ఐఎఎస్..మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, మెట్రోపాలిటన్ కమిషనర్‌గా పలు శాఖల్లో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక ఐఎఎస్ అధికారి ఏ విధంగా వ్యవహరించాలి. బాధ్యతలను ఎలా నిర్వహించాలి అనే విషయంలో సర్వీస్ రూల్స్ ఉన్నాయి. కానీ అరవింద్ కుమార్ ఆ రూల్స్ పాటించకుండా అడిగిన సమాచారం ఇవ్వకుండా ఫక్తు రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ (కండక్ట్) 1968 ప్రకారం..ఐఎఎస్ అధికారి రాజకీయ ఉద్దేశాలు లేకుండా తటస్థంగా వ్యవహరించాలి. కానీ అరవింద్ కుమార్ అధికారి పార్టీ తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడుతున్నారు' అని పేర్కొన్నారు. ఓఆర్ఆర్ సగం భాగం తాను ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న మాల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోకి వస్తుందని తెలిపారు. అధిక ఆదాయం వచ్చే ఆస్కారం ఉన్నా ఆ దిశగా అలోచన చేయకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి కేవలం రూ.7380 కోట్లకే ఐఆర్‌బి సంస్థకు 30 ఏళ్లకు ఒఆర్ఆర్ టోల్ వసూలు టెండర్ కట్టబెట్టారని విమర్శించారు. అంతేకాకుండా ఐఆర్‌బి టెండర్ కట్టబెట్టే క్రమంలో అన్ని నిబంధనలు యాధేచ్ఛగా ఉల్లంఘించారని వివరించారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ 2031తో ముగుస్తుందనీ, 30 ఏండ్లకు లీజుకు ఇస్తే...2031 తర్వాత మాస్టర్ ప్లాన్ మారుతుందన్నారు. అంతేకాకుండా దేశంలో ఏ రహదారి టెండర్ కూడా 15 నుంచి 20 ఏళ్లకు మించి ఇవ్వలేదని గుర్తు చేశారు. ఎన్‌హెచ్ఏఐ అభ్యంతరాలనూ లెక్క చేయకుండా 30 ఏండ్లకు టెండర్ కట్టబెట్టారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఎఎస్ అధికారి స్థానంలో ఒక రిటైర్డ్ ఆఫీసరును నియమించి ఓఆర్ఆర్ టెండర్ ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. టెండర్ ప్రక్రియ కొనసాగుతుండగానే హెచ్‌జిసిఎల్ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్) స్థానంలో హెచ్ఎండిఎను తీసుకొచ్చారని పేర్కొన్నారు. అంతేకాదు ఓఆర్ఆర్ టెండర్‌కు సంబంధించిన బేస్‌ప్రైస్ ఎంతో వెల్లడించాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన అరవింద్ కుమార్ నుంచి ఎటువంటి స్పందన లేదని గుర్తు చేశారు. ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్, టెండర్ విలువను మదింపు చేసిన మజర్స్ నివేదికను కూడా పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం లేదని తెలిపారు. ఇవన్నీ టెండర్ల ప్రక్రియలో ఏదో జరిగిందనే అనుమానాలకు బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఒక ప్రజాప్రతినిధిగా సంబంధిత వ్యవహారంపై స్పందించాల్సిన బాధ్యత తనపై ఉందని వివరించారు. ఈ క్రమంలో కావాల్సిన సమాచారాన్ని...ఆర్టీఐ ద్వారా తెలుసుకోవడానికి వెళ్తుంటే ఒక ప్రజాప్రతినిధిని అని కూడా చూడకుండా సచివాలయానికి వెళ్లకుండా అడ్డగించి అరెస్ట్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. లీగల్ నోటీసులో తనపై పేర్కొన్న ఆరోపణలన్నీ బూటకమని రేవంత్ పేర్కొన్నారు. అరవింద్ కుమార్ పంపిన లీగల్ నోటీసు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని తెలిపారు.

ఇ సెట్‌లో 20,899 మంది ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో రెండో ఏడాదికి లాటరల్ ఎంట్రీ ద్వారా 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ ఫలితాలను హైదరాబాద్‌లో మంగళవారం ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఈసెట్‌కు 23,261 మంది దరఖాస్తు చేయగా, 22,454 మంది పరీక్ష రాశారు. వారిలో 20,899 (93.07 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అబ్బాయిలు 16,209 మంది దరఖాస్తు చేస్తే, 15,636 మంది హాజరయ్యారు. వారిలో 14,415 (92.19 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 7,052 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 6,818 మంది పరీక్ష రాశారు. వారిలో 6,484 (95.10 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 11 కోర్సులకు ఈసెట్ రాతపరీక్ష నిర్వహించగా, అత్యధికంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగానికి 5,598 మంది దరఖాస్తు చేశారు. 5,418 మంది పరీక్ష రాస్తే 4,777 (88.17 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) విభాగానికి 5,248 మంది దరఖాస్తు చేయగా, 5,068 మంది పరీక్ష రాశారు. వారిలో 4,907 (96.82 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు 4,240 మంది దరఖాస్తు చేస్తే, 4,082 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 3,693 (90.47 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. సివిల్ ఇంజినీరింగ్‌కు 3,916 మంది దరఖాస్తు చేస్తే, 3,792 మంది పరీక్ష రాశారు. వారిలో 3,604 (95.04 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ)కి 3,136 మంది దరఖాస్తు చేయగా, 3,040 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 2,927 (96.28 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా బీఎస్సీ మ్యాథమెటిక్స్ విభాగానికి 44 మంది దరఖాస్తు చేస్తే, 16 మంది పరీక్ష రాశారు. వారిలో 16 (వందశాతం) మంది ఉత్తీర్ణత పొందారు. మెటలర్జికల్ ఇంజినీరింగ్‌కు 97 మది దరఖాస్తు చేయగా, 96 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 93 (96.88 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. తెలంగాణ నుంచి 21,120 మంది దరఖాస్తు చేస్తే, 20,517 మంది పరీక్ష రాశారు. వారిలో 19,054 (92.87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీ నుంచి 2,141 మంది దరఖాస్తు చేయగా, 1,937 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 1,845 (95.25 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఈ కార్యక్రమంలో ఒయు విసి దండెబోయిన రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

176 కాలేజీల్లో 9 వేల సీట్లు

రాష్ట్రంలో 176 ఇంజినీరింగ్ కాలేజీల్లో తొమ్మిది వేల సీట్లు అందుబాటులో ఉంటాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, ఈసెట్ కన్వీనర్ శ్రీరాం వెంకటేశ్ చెప్పారు. ఆయా కాలేజీల్లో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లు ఏడు, ఎనిమిది వేల వరకు ఉంటాయన్నారు. ఈసెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులందరికీ ఇంజినీరింగ్‌లో ప్రవేశం లభిస్తుందని వివరించారు. ముఖ్యంగా టాప్ కాలేజీల్లో చేరిన విద్యార్థులే ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు వస్తే వెళ్లిపోతారని అన్నారు. వాటిలోనే సీట్లు మిగులుతాయని చెప్పారు. ఈసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ వచ్చేనెలలో నిర్వహిస్తామన్నారు.

ఒక్కరోజు ముందుకు అమిత్‌షా పర్యటన

- నేడు హైదరాబాద్‌కు రాక
- సినీ ప్రముఖులు రాజమౌళి, ప్రభాస్‌తో ప్రత్యేక భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పర్యటన ఒక్కరోజు ముందుకు జరిగింది. వాస్తవానికి మొదట ప్రకటించిన షెడ్యూల్‌లో 15న రాష్ట్రానికి ఆయన రావాలి. మొదట భద్రాచలం రామాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి, ఆ తర్వాత ఖమ్మంలో బహిరంగ సభలో పాల్గొనాలి. ప్రస్తుతం ఆ షెడ్యూల్ మారింది. మధ్యలో కొత్తగా పలువురు ప్రముఖులతో భేటీ, రాష్ట్ర బిజెపిలో జరుగుతున్న పరిణామాలు సెట్‌రైట్ చేసేందుకు ఆయన ఒక్కరోజు ముందే వస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అమిత్‌షా బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి, సినీ నటుడు ప్రభాస్‌తో ఆయన ప్రత్యేకంగా భేటీ కానున్నట్టు తెలిసింది. రాజకీయంగా వారిద్దరూ బిజెపికి దగ్గరగా ఉంటున్న కుటుంబాలకు చెందిన వాళ్లే కావడంతో ఈ భేటీపై ఆసక్తి నెలకొంది. రాబోయే ఎన్నికల్లో తెలంగాణపై బిజెపి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. మరికొందరు ప్రముఖులతో ఆయన సమావేశం అవుతారని కూడా ప్రచారం జరుగుతున్నది. గతంలోనూ అమిత్‌షా పర్యటనలో భాగంగా సినీ హీరోలు ఎన్‌టిఆర్, నితిన్, ప్రముఖ మహిళా క్రికెట్ మిథాలీరాజ్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే.